క్లుప్తంగా

స్పోర్ట్స్ డ్రస్సులకు ఆర్థికసాయం



మదనాపురం: మండలంలోని కొన్నూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు వాలీబాల్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచినందుకు చైర్మన్ అర్చన స్పోర్ట్స్ డ్రస్సుల కోసం గురువారం రూ.ఐదు వేల నగదును బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, ఉన్నత స్థానాలను అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

మదనాపురం: మండలంలోని దుప్పల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఓపీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు గురువారం ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు కళావతి, సుప్రియ మాట్లాడుతూ రక్త మార్పిడి, సిరంజీలు, తల్లి నుంచి బిడ్డకు, అసురక్షిత లైంగిక సంపర్కం ద్వారా ఎయిడ్స్ వస్తుందని వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీనారాయణ గుప్త తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యర్థాలను తగ్గించాలి

గోపాల్‌పేట: ప్రకృతి వ్యర్థాలను సున్నా శాతానికి తీసుకొచ్చేందుకు అందరూ కృషి చేయాలని రీసెర్చ్ స్కాలర్ డాక్టర్ వత్సలరాణి, డాక్టర్ కృష్ణయ్య, డాక్టర్ ప్రసన్న అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎస్ఐఆర్, ఐఐసీటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కూరగాయల వ్యర్థాలు, పాడైన బ్యాటరీలు వంటి సాంకేతిక అంశాలపై విద్యార్థులకు మొత్తం 12 మంది రీసెర్చ్ స్కాలర్లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెజిటబుల్ వేస్ట్, పాడైన బ్యాటరీలు రీసైకిల్ చేయడం ద్వారా కరెంటు ఉత్పత్తి చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, మోహన్‌బాబు, ప్రకాశ్, దశరథం పాల్గొన్నారు.

అంబులెన్స్‌లోనే గర్భిణికి ప్రసవం

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన గర్భిణి ఉస్సేన్‌బీ కి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వెంటనే వనపర్తి మండలంలోని కడుకుంట్ల ఆస్పత్రికి చెందిన అంబులెన్స్ గర్భిణిని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా.. మార్గ మధ్యలోనే నొప్పులు ఎక్కువ కావడంతో వెంటనే స్పందించిన సిబ్బంది ఈఎంటీ నరేందర్, పైలెట్ మైనుద్దీన్, ఆశా కార్యకర్త నస్రీన్ అంబులెన్స్‌లోనే కాన్పు చేశారు. మగబిడ్డ జన్మించాడు. వైద్య సేవల నిమిత్తం తల్లి, బిడ్డను పెబ్బేరు పీహెచ్‌సీలో అడ్మిట్ చేసినట్లు సిబ్బంది తెలిపారు.

సభ్యత్వ నమోదు చేయించాలి

కొత్తకోట: రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కొత్తకోట మండలంలోని పామాపురం, అప్పరాల, అమడబాకుల, కేజీబీవీ, మోడల్ స్కూల్, పాలెం, కొత్తకోట జెడ్పీహెచ్‌ఎస్ బాలికల, బాలుర పాఠశాలలను ఆయన సందర్శించి సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి రాయిణిపల్లి శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజు, జి.శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఆంజనేయులు, రాజ్‌కుమార్ ఉన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తికి గాయాలు

పాన్‌గల్: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని ఓ వ్యక్తి గాయపడిన ఘటన గురువారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మహ్మద్‌గౌస్ మోహియిద్దీన్ బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై వనపర్తికి వెళ్తుండగా ఈద్గా సమీపంలోని మలుపు వద్ద ఎదురుగా గోపాల్‌పేట మండల కేంద్రానికి చెందిన మండ్ల తిరుపతయ్య అనే వ్యక్తి ద్విచక్ర వాహనంతో అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ ఢీకొట్టాడు. దీంతో మహ్మద్‌గౌస్ మోహిద్దీన్ కుడికాలికి రక్త గాయాలై బొటన వేలితో పాటు పక్కన ఉన్న రెండు వేళ్లు తెగి కిందపడ్డాయి. బాధితుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డెంగీతో అప్రమత్తం

పాన్‌గల్: మండలంలోని చింతకుంటలో పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గురువారం డెంగీ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు వృద్ధి నిల్వ నీటిని నిరంతరం పారబోయాలన్నారు. దీంతో పాటు గ్రామంలో డెంగీ పాజిటివ్ వచ్చిన రొడ్డోళ్ల గాయత్రి, రొడ్డోళ్ల కుర్మయ్య కుటుంబాలను పరామర్శించి, కుటుంబ సభ్యుల నుంచి, ఇంటి పరిసరాల్లోని కుటుంబ సభ్యుల నుంచి రక్త నమూనాలను సేకరించినట్లు డాక్టర్ పేర్కొన్నారు. సీజనల్‌గా వ్యాపించే వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

గణనాయక.. పాహిమాం



ఖిల్లాఘనపురం మండలం సోళీపురంలో వినాయకుడి ఊరేగింపులో యువకులు



కొత్తకోటలో..



అమరచింత శివాజీనగర్‌లో..

అమరచింత: వినాయక మండపాల్లో కొలువుదీరిన గణనాథులకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని సంతోష్‌నగర్ వినాయక మండపం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. శివాజీనగర్‌లోని వినాయక మండపం వద్ద భక్తులు గణపయ్యకు ప్రత్యేక పూజలు చేశారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంతో పాటు అప్పారెడ్డిపల్లి, సోళీపురం తదితర గ్రామాల్లో వినాయక నిమజ్జనం సందర్భంగా ఉదయం నుంచి స్వామివారి మండపాల వద్ద ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి చెంత ఉంచిన లడ్డు, పండ్లు తదితర వాటిని వేలం వేశారు. అనంతరం గణనాథులను వాహనాల్లో ఉంచి గ్రామాల్లోని వీధుల్లో ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా మహిళలు బొడ్డమ్మలు, యువకులు కోలాటం వేయడంతో పాటుగా డప్పులకు అనుగుణంగా యువత నృత్యం చేశారు.

అయ్యప్ప పడిపూజ

కొత్తకోట: పట్టణ కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి వద్ద గురువారం గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులు పడిపూజ నిర్వహించారు. గణేషుడి వద్ద జరుగుతున్న పడిపూజ కార్యక్రమానికి కాలనీవాసులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పూజ అనంతరం నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు.

వేలంలో లడ్డు దక్కించుకున్న ముస్లింలు



చిన్నంబావి: వినాయకుడి నిమజ్జనం సందర్భంగా మండలంలోని బెక్కెం (పెద్దబిల్కు) గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి వద్ద మతాలకు అతీతంగా లడ్డూ వేలం పాటలో ముస్లింలు పాల్గొని స్వామివారి లడ్డును దక్కించుకున్నారు. రూ.5కేజీల లడ్డును గ్రామానికి చెందిన ముస్లిం తాజుద్దీన్ రూ.పది వేలకు దక్కించుకోగా.. 2 కేజీల లడ్డును మహిమూద్ రూ.5,500 దక్కించుకున్నారు. ఈ సందర్భంగా గణేష్ కమిటీ సభ్యులు, గ్రామస్థులు వారిని సన్మానించారు.

ఎంపీడీఓ కార్యాలయానికి అధికారుల కేటాయింపు

సాక్షి ఎఫెక్ట్..



వీపనగండ్ల ఎంపీడీఓ కార్యాలయంలో విధుల్లో చేరిన ఇద్దరు ఉద్యోగులు

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కేవలం ఇద్దరే అధికారులు విధులు నిర్వహిస్తున్నారని వార్తా కథనాన్ని సాక్షి దినపత్రికలో గురువారం ప్రచురించింది. దీంతో స్పందించిన జిల్లా సీఈఓ కార్యాలయ అధికారులు ఇద్దరు ఉద్యోగులను వెంటనే వీపనగండ్ల ఎంపీడీఓ కార్యాలయానికి కేటాయించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా జూనియర్ అసిస్టెంట్‌గా వీపనగండ్లలో విధుల్లో చేరిన వెంకటేష్‌ను డిప్యూటేషన్‌పై రెండు రోజుల్లోనే సీఈఓ కార్యాలయానికి తీసుకున్నారు. తిరిగి అతడిని గురువారం వీపనగండ్ల ఎంపీడీఓ కార్యాలయానికి పంపించారు. అతడితో పాటు గతంలో టైపిస్టుగా పనిచేసిన అమీర్ కూడా విధుల్లో చేరారు. గతంలో మంత్రి జూపల్లి కృష్ణారావు అదనపు అధికారులను నియమించాలని ఫోన్ చేసిన వెంటనే రెండు రోజులు నామమాత్రంగా అధికారులను నియమించారు. ఆ తరువాత తిరిగి వారిని డిప్యూటేషన్‌పై పంపించారు. ఇప్పుడైనా బదిలీపై వచ్చిన అధికారులకు ప్రొసీడింగ్‌లను అందజేసి ఇదే కార్యాలయంలో పూర్తి స్థాయిలో విధులు నిర్వహించే విధంగా ఆదేశాలు ఇవ్వాలని మండల ప్రజలు సీఈఓకు విజ్ఞప్తి చేస్తున్నారు. కార్యాలయంలో ఉద్యోగుల కొరత ఉందన్న విషయాన్ని సాక్షి కథనం ద్వారా అధికారులకు చేరవేసిన సాక్షి దినపత్రికకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

క్షేత్రస్థాయిలో బీజేపీని బలోపేతం చేద్దాం



మాట్లాడుతున్న కొత్తకాపు శివారెడ్డి

కొత్తకోట రూరల్: క్షేత్రస్థాయిలో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని బీజేపీ పెద్దమందడి మండల అధ్యక్షుడు తిరుపతయ్య అన్నారు. గురువారం పెద్దమందడి మండల కేంద్రంలో బీజేపీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు ముమ్మరంగా చేయాలని, 10వేలకు పైగా సభ్యత్వాలను చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. దేశం నరేంద్రమోదీ నాయకత్వంలో ఎంతో అభివృద్ధి చెందుతుందని, రాష్ట్రంలో బీజేపీ బలపడుతుందన్నారు. ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు బీజేపీ వైపు చూస్తున్నారని తెలిపారు. పంచాయతీ ఎన్నికల లోపు బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. త్వరలో జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ మంచి ఫలితాలను సాధిస్తుందని జోస్యం చెప్పారు. దేశంలో జరుగుతున్న అభివృద్ధి ప్రజలకు తెలిసేలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో శివారెడ్డి, చెన్నయ్య, సి.యాదయ్య, కర్ణాకర్, దత్తాత్రేయరెడ్డి, రాములు, రవి, నరేష్, సురేందర్, కృష్ణయ్య, బాలరాజు, నరేష్, విఠల్‌రెడ్డి, స్వాతి, వెంకటయ్య, రాములుయాదవ్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

అమరచింత: మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం బీజేపీ నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమాలు విస్తృతంగా కొనసాగాయి. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి, జిల్లా సభ్యత్వ కోకన్వీనర్ మరాఠి అశోక్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి బీజేపీ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ వారి నుంచి సభ్యత్వాలు స్వీకరించారు. కార్యక్రమంలో మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూరిజిస్ట్రేషన్ సమయంలో ఇబ్బందులు

- మామూళ్లు ఇస్తేనే పనులు.. లేకుంటే తీవ్ర జాప్యం
- కార్యాలయం చుట్టూ తిరుగుతున్న అన్నదాతలు



కార్యాలయం వద్ద స్లాట్ బుకింగ్ పత్రాలను చూపుతున్న గిరిజన రైతు లక్ష్మణ్‌నాయక్ దంపతులు

పాన్‌గల్: ప్రతి నిత్యం ఎక్కడో ఒక చోట లంచాలు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడుతున్నా.. అధికారుల్లో మార్పు రాకపోవడంతో ప్రజలు, రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు. పాన్‌గల్ మండల తహసీల్దార్ సుభాష్‌నాయుడు తాను చెప్పిందే వేదం అంటూ నిబంధనల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటున్నాడు. మామూళ్లు ఇస్తే తప్ప ఫైళ్లు ముందుకు జరగడం లేదనే విమర్శలు మండలంలో వినిపిస్తున్నాయి. లేదంటే అనవసర కారణాలు చూపుతూ కాలయాపన చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. మీసేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకున్న అనంతరం రిజిస్ట్రేషన్ చేయాల్సిన అధికారి దానికి పలు రకాల కొర్రీలు పెడుతూ పనులు చేయడం లేదని, దీంతో తప్పని పరిస్థితుల్లో ఎంతో కొంత ముట్టజెప్పాల్సి వస్తుందని రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలోని అన్నారంతండాకు చెందిన లక్ష్మణ్‌నాయక్ అనే రైతు తన పొలంలో ఒక ఎకరం పొలాన్ని ఇతరులకు విక్రయించే నిమిత్తం గత నెల 28వ తేదీన మీసేవా కేంద్రంలో రూ.16,613 చెల్లించి స్లాట్ బుక్ చేశారు. స్లాట్ బుక్ చేసిన రైతు పొలాన్ని ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయమంటే తహసీల్దార్ పొలంపై బ్యాంకు రుణం ఉందని, బ్యాంకుకు వెళ్లి నో అబ్జక్షన్ ధ్రువపత్రం తీసుకొస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తామని చెబుతున్నాడని గిరిజన రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో కార్యాలయం చుట్టూ గత 15 రోజుల నుంచి తిరుగుతున్నా ఇప్పుడు, అప్పుడు అని, అనవసర కొర్రీలు పెడుతూ ఇబ్బందుల పాలు చేస్తున్నాడన్నారు. గతంలో మండలంలోని చాలా గ్రామాల రైతులకు పాపు పుస్తకం లేకపోయిన, బ్యాంకు రుణం ఉన్న రిజిస్ట్రేషన్ చేసిన ఘటనలు ఉన్నాయని రైతు తెలిపారు. గతంలో చేసిన రిజిస్ట్రేషన్లపై సమగ్ర విచారణ జరిపి రైతుల ఇబ్బందులు తొలగించాలన్నారు.

నిబంధనల మేరకే..

> నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్లు చేస్తున్నాం. బ్యాంకు రుణం ఉంటే దానికి సంబంధించి నో అబ్జక్షన్ ధృవపత్రం తీసుకురావాలి. చాలా గ్రామాల్లో రైతులకు బ్యాంకు రుణాలు ఉన్నా రిజిస్ట్రేషన్లు చేశారని, మామూళ్లు ఇస్తే చేస్తున్నారని ఆరోపణల్లో నిజం లేదు. సరైన పత్రాలు ఉన్న ఎవరికీ రిజిస్ట్రేషన్ సమయంలో ఇబ్బందులకు గురి చేయట్లేదు.
>
> – సుభాష్‌నాయుడు, తహసీల్దార్, పాన్‌గల్

పంచాయతీ కార్యదర్శికి ఘన సన్మానం



పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండా పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న నర్మదను గురువారం తండావాసులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్, మాజీ సర్పంచ్ శాంతమ్మ మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శి నాలుగున్నరేళ్ల కాలంలో తండా అభివృద్ధికి, పారిశుద్ధ్య నివారణలో కీలక పాత్ర పోషించారన్నారు. తండా అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శి సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ బిల్యానాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ సోమ్లానాయక్, గిరిజన సంఘం నాయకులు, తండావాసులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం



వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలు, పోక్సో చట్టం, సైబర్ నేరాలు, 100 డయల్‌పై పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. పాఠశాల ఆవరణలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ.. చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వారికి సూచించారు.

కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

వీపనగండ్ల: మండల కేంద్రంలోని బాబూ జగ్జీవన్‌రాం కాలనీలో రెండేళ్లుగా ప్రధాన రోడ్డుపైకి కొందరు నీళ్లు వదలుతుండడంతో గుంతలుగా మారిన రోడ్లపై మురుగు నిలిచి ప్రజలు అనారోగ్యానికి గురయ్యే పరిస్థితులు నెలకొన్నాయని గ్రామస్తులు వాపోయారు. వెంటనే మురుగును తొలగించి పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల కేంద్రానికి చెందిన గడ్డమీది రాధాకృష్ణ, మీసాల శివ, ప్రసాద్, గురువారం తహసీల్దార్ వరలక్ష్మితో పాటు, ఎంపీడీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రాలు అందజేశారు. కాలనీలోని కొందరు రోడ్డును ఆక్రమించారని అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

మండల స్థాయి ఆటపోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పి.సుఖేశిని

కొత్తకోట రూరల్: ఎస్‌జీఎఫ్ ద్వారా నిర్వహిస్తున్న ఆటల పోటీలను గురువారం కొత్తకోట బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.సుఖేశిని, మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్ జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. మండల స్థాయిలో జరిగే ఈ పోటీల్లో పాల్గొనేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థులు తరలివచ్చారు. వాలీబాల్ పోటీల్లో బాలికల విభాగంలో జెడ్పీహెచ్‌ఎస్ అమడబాకుల, బాలుర విభాగంలో కొత్తకోట పీపుల్స్ స్కూల్ మొదటి బహుమతులు సాధించాయి. కబడ్డీ పోటీల్లో బాలికల విభాగంలో జెడ్పీహెచ్‌ఎస్ పాలెం, బాలుర విభాగంలో ఎస్సీ గురుకుల (వీపనగండ్ల) మొదటి బహుమతి సాధించారు. గెలుపొందిన క్రీడా కారులకు బహుమతులను జిల్లా సెక్టోరియల్ అధికారి యుగంధర్ అందజేశారు. మండల స్థాయి పోటీలకు బహుమతుల దాత పీఆర్‌టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు సూర చంద్రశేఖర్‌ను అభినందించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ నారాయణమ్మ, ఎంపీఓ కృష్ణయ్య, నిర్మలాదేవి, మద్దిలేటి, అమరేందర్‌రెడ్డి, ఆకుల వెంకటయ్య, గోపాల్, రాంచంద్రమ్మ, వెంకటేష్, రాము, మధు తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి సేవలు చిరస్మరణీయం



వనపర్తి రాజీవ్‌చౌక్‌లో సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



పాన్‌గల్ మండలం బుసిరెడ్డిపల్లిలో..

సాక్షి, నెట్‌వర్క్: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి (72) మరణం దేశానికి తీరని లోటని మాజీ రాజ్యసభ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, సీపీఎం, సీపీఐ, ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు అన్నారు. ఎంపీగా ఆయన సేవలు మరువలేనివన్నారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు జిల్లా వ్యాప్తంగా పార్టీ జెండాను అవనతం చేసి, ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు ఎండీ జబ్బార్, పుట్ట ఆంజనేయులు, నాగేశ్వర్, మండల కార్యదర్శి జీఎస్ గోపి, జిల్లా నాయకులు అజయ్, శ్యాంసుందర్, బుచ్చన్న, బాల్‌రెడ్డి, మేకల ఆంజనేయులు, లక్ష్మి, డీవైఎఫ్ఐ నాయకులు మస్తాన్, జగన్, విష్ణు, శ్రీకృష్ణ, భాను, గ్రామస్తులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



పెబ్బేరులో..



మూలమళ్లలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత

ఆత్మకూర్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, హెచ్‌ఎం వెంకటయ్య అన్నారు. గురువారం మండలంలోని మూలమళ్ల అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, పండ్లు, మాంసకృత్తులు ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సంధ్యారాణి, విజయలక్ష్మి, రాణి, రఫీఖాబాను, ఖాజీయాబేగం, హసీన, మాధవి, ప్రభావతి, లక్ష్మీదేవి, కృష్ణవేణి, నాగమ్మ, స్థానికులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఎదుగుదలపై అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ రవీంద్ర అన్నారు. పెబ్బేరు పట్టణ కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాస కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మమ్మ, సూపర్‌వైజర్ ఆసీయాషాహిన్, లక్ష్మీనారాయణమ్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించండి



అమరచింత: గణేష్ నిమజ్జన సమయంలో జాగ్రత్తలు పాటించాలని, లేనిపక్షంలో ప్రాణాపాయం కలిగే అవకాశాలు ఉన్నాయని ఎస్ఐ సురేష్ అన్నారు. మండలంలోని చంద్రగఢ్‌లో గణేష్ మండపాల వద్ద నిర్వాహకులకు నిమజ్జన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. డీజే సౌండ్‌లతో శారీరక సమస్యలు, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడే వారికి ఇబ్బందులు కలుగుతాయన్నారు. మద్యం తాగి డ్యాన్సులు చేయడం ద్వారా గాయాలయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రజలు సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలన్నారు. మైనర్లు ద్విచక్ర వాహనాలు నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. మైనర్లకు బైక్‌లు ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

'హిందూ సమాజాన్ని జాగృతం చేద్దాం'

ఖిల్లాఘనపురం: హిందూ సమాజాన్ని జాగృతం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా నాయకుడు గాండ్ల రాములు, మండల నాయకులు పట్టాభి రాములు, విక్రం, బురాన్ శ్రీను, అంజనేయులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బెస్తగేరి గంగమ్మ తల్లి ఆలయంలో మండల విశ్వహిందూ పరిషత్ శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన వారు మాట్లాడుతూ దేశంలోని ప్రతి హిందువు మన సంప్రదాయాలు, సంస్కృతిని ఖచ్చితంగా పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో విశ్వహిందూ పరిషత్ కమిటీలు ఏర్పాటు చేయాలని వారు చెప్పారు.



గ్యాస్ సబ్సిడీ ప్రొసీడింగ్ కాపీల పంపిణీ



కొత్తకోట రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని కాంగ్రెస్ నాయకుడు మదిర శ్రీశైలం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా పెద్దమందడి మండలంలో పామిరెడ్డిపల్లిలో 254 మంది లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ ప్రొసీడింగులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిగిలిన వారికి రెండో విడతలో ప్రొసీడింగ్ కాపీలు అందుతాయన్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి సహకారంతో గ్రామంలో అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివశంకర్, మాజీ ఎంపీపీ మన్నెపురెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు చందు, నరేష్, షౌకత్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌తోనే దేశ సంస్కృతికి ప్రమాదం'

అమరచింత: భారత దేశంలో హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఏఐసీసీ నాయకుడు రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలు అర్థరహితంగా, దేశ సంస్కృతిని నాశనం చేసే విధంగా ఉన్నాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి అన్నారు. మండలంలోని కిష్టంపల్లిలో పార్టీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలన్నీ దేశాన్ని చూసి ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తుంటే.. రాహుల్‌గాంధీ శక్తిస్వరూపిణిగా పూజలందుకుంటున్న దుర్గా మాత దేవత కాదని, అసలు దేవుళ్లు లేరని చెప్పడంపై మండిపడ్డారు. రాష్ట్ర ఎన్నికల సంగ్రామంలో అధికారం కోసం ఇక్కడి కాంగ్రెస్ నాయకులు ఎన్ని దేవుళ్లపై ప్రమాణం చేసి ఉంటారనే విషయాలను గుర్తించుకోవాలని సూచించారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసే ఇలాంటి ప్రకటనలు చేయడం సరికాదన్నారు. రాహుల్‌గాంధీ పద్ధతి మార్చుకోకపోతే తగిన బుద్ధి చెప్పే రోజు తొందర్లోనే వస్తుందన్నారు. కార్యక్రమంలో మరాఠి అశోక్‌కుమార్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి పరామర్శ

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని శాఖాపూర్.వై గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు మర్యాద రవీందర్‌రెడ్డి మోకాలు సర్జరీ చేయించుకున్నారు. స్థానిక నాయకులతో కలిసి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి గురువారం గ్రామంలో బాధితుడి ఆరోగ్యంగా గురించి ఆరా తీశారు. అనంతరం గ్రామంలో జక్కుల బాలస్వామి మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు వనం రాములుయాదవ్, పెద్దింటి వెంకటేష్, సూగూరు వెంకటేష్, యాదగిరి, పరమేష్‌నాయీ, నాగిరెడ్డి, వెంకటన్నగౌడ్, శంకర్‌రెడ్డి, సహదేవుడు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.